



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, విఒఎలు

విఒఎలపై వేధింపులు తగదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తిపుట్టపర్తి అర్బన్

ప్రభుత్వాలు మారిన ప్రతి సారీ విఒఎలపై రాజకీయాల వేధింపులు తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తెలిపారు. వెలుగు విఒఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ బయటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈఎస్.వెంకటేష్, జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ విఒఎలను తీసివేయడం రాజకీయ వేధింపులు పరిపాటిగా మారిందన్నారు. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లో తీసుకోవాలన్నారు. మహిళ మార్టుల్లో బలవంతంగా సరుకులు తీసుకోవాలనే నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ విజయ సారధికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, పెడవబల్లి బాబా, నరసింహారావు, విఒఎ జిల్లా నాయకులు సుజాత, జగన్ రెడ్డి, సునీత, నీరజ పాల్గొన్నారు.

పెనుకొండ వైసిపిలో

జగని రచ్చ..!

అధికారం మార్పు తర్వాత పెనుకొండ వైసిపి పరిస్థితి మూడు కొట్లాటలు.. ఆరు కుమ్మలాటలు అన్న చందంగా తయారైంది. పట్టు కోసం ఇద్దరు మాజీ మంత్రులు నువ్వానేనా అంటూ కాలుదువ్వుతున్నారు. ఇద్దరు మాజీ మంత్రులకు సొంత నియోజకవర్గం లేక ఇక్కడే పాగా వేయాలని ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. ఉషశ్రీ వద్దు అంటూ ఒక వర్గం.. శంకరనారాయణ వద్దు అంటూ మరో వర్గం పోటాపోటీగా సభలు, సమావేశాల్లో బహిరంగా ప్రకటిస్తున్నారు. ఇటీవల ఇద్దరు నేతలు, వారి అనుచరుల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే స్థాయికి వర్గ విభేదాలు చేరుకున్నాయి. శంకరనారాయణకు మద్దతుగా ఉన్న గోరంట్ల మండలానికి చెందిన ముగ్గురు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకుని నువ్వా నేనా అంటూ సవాళ్లు.. ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు.







- వీధికెక్కుతున్న మాజీ మంత్రుల పోరు
- నువ్వా..నేనా అంటున్న ఉషశ్రీ, శంకరనారాయణ
- ఉషశ్రీకి వ్యతిరేకంగా సమావేశాలు
- జనసేన, బిజెపి టచ్‌లోకి ఇద్దరు నేతలు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం పరిధిలోని గోరంట్ల మండలంలో ఇటీవల ఉషశ్రీకి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించిన నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఒక్కసారిగా పార్టీ నాయకులు, కార్యకర్తలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. బుధవారం నాడు గోరంట్లలో సస్పెండ్ అయిన బాబు(బుల్లెట్), నాగేనాయక్, పాటూరిశంకర్ రెడ్డి(కనిగిరి శంకర్‌రెడ్డి)లు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఉషశ్రీ గెలుపుకోసం, పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డామని, అప్పుడేందుకు మమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదంటూ ప్రశ్నించారు. ఉషశ్రీని పెనుకొండ నియోజకవర్గం నుంచి పంపించే వరకు తమ పోరాటం ఆగదంటూ హెచ్చరించారు.

తారాస్థాయికి వర్గ విభేదాలు

2024 ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉషశ్రీ పోటీచేసి ఘోరంగా పరాజయం పాలైయ్యారు. అప్పటి వరకు పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న శంకర నారాయణ అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఓటమి మూటగట్టుకున్నారు. ఈ ఇద్దరికీ సొంత నియోజకర్గాలు లేవు. దీంతో పెనుకొండలో పాగా వేసేందుకు ఇద్దరు మాజీలు ప్రయత్నిస్తున్నారు. వీరిద్దరికీ పార్టీలో వ్యతిరేక వర్గాలూ ఉన్నాయి. శంకరనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ఒక సామాజికవర్గం నాయకులను అణగదొక్కరనే ఉద్దేశంతో ఉషశ్రీకి ఆ వర్గం నాయకులు దగ్గరైయ్యారు. శంకరనారాయణ వద్దు అంటూ వారు వ్యతిరేకిస్తున్నారు. మరో వైపు ఉషశ్రీని వ్యతిరేకించే శంకరనారాయణ వర్గం నాయకులు, కార్యకర్తలు ఆమె పెనుకొండకు వద్దు అంటూ బహిరంగం సభల్లో ప్రకటిస్తున్నారు. ఉషశ్రీ తనకు అనుకూలంగా ఉన్న భజనపరులనే దగ్గరకు తీసుకుందని, పార్టీకోసం కష్టపడి పని చేసిన వారిని దూరం పెడుతోందనే విమర్శలున్నాయి. బెంగళూరులో నివాసం ఉంటూ చుట్టపుచూపుగా వచ్చి వెళ్లుతుందని ఇలాంటి పరిస్థితుల్లో అందరికీ అందుబాటులో ఉన్న శంకరనారాయణ తమకు మేలని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఉషశ్రీని జిల్లా అధ్యక్షురాలుగా పార్టీ అధిష్టానం ప్రకటించినప్పటి నుంచి శంకరనారాయణ వర్గంపై కక్షసాధింపు చర్యలు తీసుకోంటుందని ఆరోపణ లున్నాయి.

పార్టీ క్యాడర్‌లో అయోమయం

పెనుకొండ నియోజకవర్గం అంటే తెలుగుదేశంకు కంచుకోట. 2019 ఎన్నికల్లో మాలగుండ్ల శంకరనారాయణ విజయం సాధించి టిడిపి కోటపై వైకాపా జెండా ఎగురవేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన అనంతపురం ఎంపీగా పోటీచేసి ఓడి పోయారు. కళ్యాణదుర్గం నుంచి వచ్చిన ఉషశ్రీ తెలుగుదేశం అభ్యర్థి సవితపై పోటీచేసి ఓటమిపాలైయ్యారు. ఓటమి చెందిన తర్వాత తన మకాం బెంగళూరుకు మార్చారు. శంకరనారాయణ మాత్రం పెనుకొండలో నివాసం ఉంటున్నారు. దీంతో పార్టీ క్యాడర్ అందుబాటులో ఉన్న శంకరనారాయణ వద్దకు వెళ్తున్నారు. శంకరనారాయణ వర్గం ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పని చేశారని భావించిన ఉషశ్రీ వారిని దూరంపెడుతూ వచ్చింది.

మరో వైపు తనను నియోజకవర్గం నుంచి పోటీ చేయకుండా అడ్డుకున్న శంకరనారాయణ వ్యతిరేక వర్గం ఉషశ్రీకి అండగా నిలిచింది. దీంతో పార్టీ క్యాడర్ రెండు వర్గాలు విడిపోయింది. పార్టీ పిలుపినిచ్చిన కార్యక్రమాలు రెండు వర్గాలూ విడివిడిగా చేస్తున్నాయి. సొంత పార్టీ నేతలే ఒకరిపై ఒకరూ నిందల వేసుకుంటూ అభసుపాలు అవుతున్నారు. దీంతో పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉషశ్రీ వద్దు అంటూ పార్టీ అధిష్టానానికి తెలిపేందుకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వెళ్లుతున్నట్లు తెలిసింది.

జనసేన, బిజెపి టచ్‌లోకి ఇద్దరు మాజీ మంత్రులు..

ఇద్దరు నేతల మధ్య విభేధాల నేపథ్యంలో వైసిపి పెనుకొండ నియోజకవర్గం బాధ్యతలు ఎవరికీ ఇస్తారో తెలీయని దుస్థితి నెలకొంది. దీంతో మాజీ మంత్రులిద్దరూ తమ దారి వెతుక్కునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరిలో ఒకరు జనసేన, మరోకరు బిజెపి పార్టీ నాయకులతో సంప్రదింపులు జరిపినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వైకాపాలో ఉంటే తమ ఉనికి కోల్పోవాల్సి వస్తుందని భావించిన మాజీ మంత్రులు పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలిస్తోంది. ఒక మాజీ మంత్రి ఇప్పటికే బెంగళూరులో బిజెపి నాయకులతో చర్చించినట్లు సమాచారం. మరో మాజీ మంత్రి తనకు పరిచయం ఉన్న జనసేన ముఖ్య నాయకులతో మాట్లాడినట్లు నియోజకవర్గంలో పుకార్లు చక్కర్లు కొట్టుతున్నాయి.

మరి కొందరిపై వేటు..?

ఉషశ్రీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న శంకరనారాయణ వర్గానికి చెందిన మరి కొందరు నాయకులు, కార్యకర్తలపై వేటు వేసేందుకు జిల్లా అధ్యక్షురాలు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గోరంట్ల మండలానికి చెందిన ముగ్గురు ముఖ్య వైసిపి నాయకులను మూడు రోజుల క్రితం పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఆమెకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకుంటుందని గుసగుసులున్నాయి. నియోజవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను పూర్తిగా తనవైపు మార్చుకునేందుకు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పెనుకొండ నియోజకవర్గం వైసిపి పరిస్థితి రానురాను దిగిజారిపోతోందనే భావన ఆ పార్టీ మద్దతుదారుల నుంచే విన్పిస్తోంది.



ఉషశ్రీకి వ్యతిరేకంగా విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి గోరంట్ల నాయకులు

ప్రత్యేక కౌంటర్లలో ఉల్లి అమ్మకాలు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

కర్నూలు మార్కెట్ యార్డ్ నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుని జిల్లాలో అన్ని మండలాల్లో సివిల్ సప్లై ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేపట్టాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సివిల్ సప్లై ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ, పరిస్థితి నియంత్రణపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు అకస్మాత్తుగా పెరిగిపోకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను సివిల్ సప్లయ్ శాఖ ద్వారా నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలన్నారు. నిత్యావసరాలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించడానికి టోక్, హోల్‌సేల్ వ్యాపారస్తులు, దిగుమతిదారులు, మిల్లర్లు ప్రొసీసర్లతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారి మాట్లాడుతూ జిల్లా అంతటా ఫైన్ రైస్, రెడ్ గ్రామ్ పప్పు విక్రయించడానికి అన్ని మండల కేంద్రాల్లో 34 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వంటె నూనెను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. వారానికి ఒకసారి ధరలు నియంత్రణపై సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ ఎంఎల్ఎన్.మూర్తి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, రైతు చెన్నకేశవులు, తూనికలు కొలతలు శాఖాధికారులు, ఇతర మిల్లుల యాజమాన్య ప్రతినిధులు, ఇతర ఎన్జీవో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక సినిమాలు తీయండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే సినిమాలు, యూటూబ్ చిత్రీకరణలు ఉండాలనిఎస్ఐ సోమశేఖర్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక జ్యోతి హైస్కూల్ నందు బత్తల ఆదినారాయణ ఏర్పాటు చేసిన ఆది ట్యూన్స్ యుటూబ్ ఛానల్‌ను ఎస్ఐ ప్రారంభించారు. జ్యోతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎస్ఐ సోమశేఖర్, డైరెక్టర్ మల్లిఖార్జున మాట్లాడుతూ ఆర్టీటీ ఆసుపత్రిలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్న ఆదినారాయణ తన సొంత ఖర్చులతో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి తన వంతు కృషి చేస్తున్నాడని కొనియాడారు. అదేవిధంగా బత్తలపల్లి మండలంలో కళాకారులకు కొదవలేదని వారిని ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం 'కొడకా కోటి ఆశలతో' అనే సాంగుకు సంబందించిన పోస్టర్లును విడుదల చేసి, ఛానల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ ఆదినారాయణ, నటీనటులు జయసింహ, చందు, సావిత్రి, నిహార్, నంద, కెమెరామెన్లు పవన్‌లింగాల, సంపత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల కోసం వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండలంలోని లోచర్ల గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని వ్యకాసం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు బుధవారం ఒదజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేసులు మాట్లాడుతూ దశాబ్ద కాలం నుండి సొంత ఇల్లు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక ఇంటి బాడుగుల కట్టలేక పిల్లల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లులేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలము ఇస్తామని హామీ ఇచ్చిందని అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాల మంజూరు కు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమాదేవి, లక్ష్మి , లక్ష్మమ్మ , చిన్న నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలల దినోత్సవం

హిందూపురం : చిన్నారుల ఆరోగ్యం పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని న్యాయవాదులు కళావతి, సంతోషి కుమారి, నవేరా, రవిచంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని న్యూ హస్నాబాద్ అంగన్వాడి కేంద్రంలో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడేళ్ల లోపు ఉన్న చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. 14 సంవత్సరాల వరకు ఖచ్చితంగా నిర్బంధ విద్యను అమలు చేయడం జరుగుతుందని, తల్లితండ్రులు తమ పిల్లలను పనుల్లోకి పంపించకుండా పాఠశాలలకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అఈ కార్యక్రమంలో న్యాయవాది గురునాథ్, అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

పంటలబీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

రైతులు రబీ సీజన్ లో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారిణి చందన అన్నారు. బుధవారం మండలలోని ఎర్రమంచిలో. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం వ్యవసాయ అధికారిణి మాట్లాడుతూ...వరి, వేరుశెనగ,టమోటా పంటలకు రైతులు పంట బీమా చేయించుకోవడం వల్ల పంట నష్టపోతే, నష్టపరిహారం పొందవచ్చన్నారు. వరి పంటకి డిసెంబర్ ఆఖరులోపు, వేరుశెనగ, టమోటా పంటలకు డిసెంబర్ 15 తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఒక ఎకర వరి పంటకి రూ.630, వేరుశెనగ పంటకు రూ.480, టమోటా పంటకు రూ.1600 ప్రీమియం రైతులే చెల్లించాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులు బ్యాంకు పాసు పుస్తకం ,ఆధార్ కార్డు, భూమి పాసు పుస్తకం జెరాక్స్ కాపీలు, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం రైతు సేవా కేంద్రం సిబ్బందితో తీసుకుని మీసేవ, సచివాలయాలలో బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచి నాగమూర్తి, ఎఇఒ యం.అశోక్ కుమార్, బీమా కంపెనీ అధికారులు,రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రయాణికుడికి నగలు అందజేస్తున్న దృశ్యం

ఆర్టీసీ డ్రైవర్ల నిజాయితీ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు నగలు, విలువైన డాక్యుమెంట్ పత్రాలను సంబందిత ప్రయాణికుడికి బస్సు డ్రైవర్లు అందించి తమ నిజాయితీని నిరూపించుకున్నారు. అందుకు సంబందించిన వివరాలు.. మంగళవారం నెల్లూరు నుంచి పుట్టపర్తికి వచ్చిన సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణికుడు 40 గ్రాముల బంగారు, విలువైన పత్రాల బ్యాగులు మరచిపోయాడు. పుట్టపర్తి డిపోకు చేరుకున్న బస్సు డ్రైవర్లు ఎస్. వి. నారాయణ, డిసి. శేఖర్ ఆ బ్యాగును డిపోలో అందజేశారు. 20వ తేదీ బుధవారం సరైన ఆధారాలు సంపాదించి ఆ ప్రయాణికుడు నెల్లూరు జిల్లా వాకాడు మండలానికి చెందిన సోమయ్యది గా గుర్తించారు. దాదాపు మూడు లక్షల రూపాయల విలువ చేసే బంగారు నగలు, విలువైన పత్రాలను సంబందిత ప్రయాణికుడికి అందజేసినట్లు డిపో మేనేజర్ ఈనయతుల్లా తెలిపారు. నగల బ్యాగును నిజాయితీగా అందజేసిన డ్రైవర్లకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థులు చిన్న వయసులోనే సేవాభావం అలవర్చుకుని చదువులలో రాణించాలని సత్యసాయి భక్తులు శ్రీ వాణి తెలిపారు. శ్రీ వాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని నూరు మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు, జామెంట్రీ పరికరాలు, పలకలు, పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ ఏచూరి, అపర్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పురం' మున్సిపల్ చైర్మన్‌గా బలరామిరెడ్డి



బలరామిరెడ్డికి శుభకాంక్షలు తెలుపుతున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా బలరామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉన్న ఇంద్రజ గత ఆగస్టు నెలలో తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే అప్పటి నుంచి మున్సిపల్ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఎన్నికల సంఘం త్వరలో మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇస్తుందని అధికారంలో ఉన్న టిడిపి క్యాంపు రాజకీయాలను సైతం చేపట్టింది. అయితే నోటిఫికేషన్ వెలువడలేదు. ఎవరు ఊహించని విధంగా మున్సిపల్ ఉన్నతాధికారులు వైస్ చైర్మన్ -2 బాధ్యతలు నిర్వహిస్తున్న బలరామిరెడ్డిని తాత్కాలిక చైర్మన్ గా నియమిస్తూ గత వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని బలరామిరెడ్డికి మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు వివరించారు. దీంతో ఆయన బుధవారం మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన బలరామిరెడ్డికి మున్సిపల్ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, ఇంచార్జ్ మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంజనీర్లతో పాటు మున్సిపల్ అధికారులు, పలువురు కౌన్సిలర్లు బలరామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా : ప్రభుత్వం, మున్సిపల్ ఉన్నతాధికారులు తనను తాత్కాలిక మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక చేయడం పై బలరామిరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మున్సిపల్ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటానని ప్రజలు వారు ఎదుర్కొనే సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మున్సిపల్ అధికారులను, తోటి కౌన్సిలర్లను సమన్వయం చేసుకుని పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. మూడు నెలల నుంచి కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరగకపోవడంతో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు ఆగిపోయాయని, త్వరలో కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై సమావేశంలో చర్చించి వివిధ వార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు.

నేపాల్‌లో వాటర్ ప్రాజెక్టులను ప్రారంభించిన రత్నాకర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



ఆన్‌లైన్‌లో ప్రాజక్టును ప్రారంభిస్తున్న రత్నాకర్

నేపాల్‌లోని అత్యంత మారుమూల ఉన్న పాఠశాలల విద్యార్థులకు తాగునీరు అందించే 8 కమ్యూనిటీ తాగునీటి ప్రాజెక్టులను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ఆన్‌లైన్ ద్వారా బుధవారం ప్రారంభించారు. బుధవారం ప్రశాంతి నిలయం నుంచి ఈ ప్రాజెక్టును ఆయన నేపాల్ భక్తుల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ భారతదేశ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నేపాల్ లోని వెనుకబడ్డ పాఠశాలలకు, గ్రామాలకు తాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం అభినందనీయమన్నారు. అక్కడ ఒక బిందె నీటి కోసం మైళ్ళకొద్దీ వెళ్లాల్సి వస్తుందన్నారు. సాయి సేవా సంస్థలు సమస్యలు పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అక్కడ ప్రజలకు, విద్యార్థులకు ఈ ప్రాజెక్టుల ద్వారా సురక్షిత నీరు అందుతుందన్నారు. మానవసేవే మాధవసేవ అని బాబా చెప్పిన బోధనలు స్ఫూర్తిగా సేవా సంస్థలు ఇలాంటి సమస్యలు పరిష్కరించడం గొప్ప విషయం అన్నారు. అనంతరం పుట్టపర్తికి విచ్చేసిన నేపాలీ సాయి భక్తులు సాయి కుల్వంత్ హాల్ లో కనెక్ట్ టు కరెక్ట్ పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రైతు,కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైతులు,కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 26న నిర్వహించే ఆందోళనకు సిద్ధం కావాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి పిలుపునిచ్చారు. బుధవారం పెనుకొండ పట్టణంలో సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంయుక్త కిషన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నవంబర్ 26న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చిందని తెలిపారు. కేంద్రం అనవసరంగా దిగుమతి చేసుకున్న పంటల వల్ల గిట్టుబాటు ధర లేక రెండు సంవత్సరం కాలంలో రైతాంగం రూ. 8 లక్షల కోట్లు నష్టపోయిందని తెలిపారు.మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి కేంద్ర ప్రభుత్వం దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం విరమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, సీఐటీయూ మండల నాయకులు మహబూబ్ బాషా, రాజరావు, ఆటో నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



నటుడు రవికి చిత్రపటం అందజేస్తున్న పూజారి

ఖాద్రీశుడి సన్నిధిలో సినీనటుడు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సినీ నటుడు, యాంకర్ రవి బుధవారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. జనసేన పార్టీ నాయకులు వారి మిత్రులు సినీ నటుడు, యాంకర్ రవికి స్వాగతం పలికారు. అనంతరం రవి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కదిరి పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన సినీ నటుడు యాంకర్ రవి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అసెంబ్లీ సమావేశాలలో వడ్డెర్ల సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్యేను పల్లె సింధూర రెడ్డిని బుధవారం వడ్డెరసంఘం నాయకులు సన్మానించారు. మంగళగిరిలో సత్యసాయి జిల్లా రాయలసీమ వడ్డెర్ల సంఘం నాయకులు జెరిపిటి కృష్ణమూర్తి ,వడ్డే సిమెంట్ పోలన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టసభల్లో వడ్డెర్ల గురించి వడ్డెర్ల సమస్యల గురించి మాట్లాడటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు సంజీవ రాయుడు, బీసీ రమణ, వల్లెపు బాల, అంకమ్మరావు, సంపంగి ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచికి అభినందన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని నాగినాయిని చెరువు తండాకు చెందిన సర్పంచ్ అంజి నాయక్ అఖిలభారత బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో ఆయనను బుధవారం పలువురు బంజారాలు సన్మానించారు. ఈ సందర్భంగా అంజి నాయక్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసనాయక్, వెంకటేష్ నాయక్, అనిల్ కుమార్ నాయక్, నారాయణనాయక్, అంజినాయక్, బాలాజీ నాయక్, చిన్నా నాయక్, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ ఎంఇఒగా వేమనారాయణ

ప్రజాశక్తి ముదిగుబ్బ

ముదిగుబ్బ ఎంఇఒగా వేమనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లమాడ మండలంలో పనిచేస్తున్న ఈయన ముదిగుబ్బ ఎంఇఒగా ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ- 2 రమణప్ప, ఉపాధ్యాయులు ఫకృద్దీన్, ఈశ్వరయ్య, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ , సైపుల్లా, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని మండ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ఎస్ఐ రమేష్ బాబు బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి దేశానికి సేవ చేసే విధంగా విద్యార్థులు ఎదగాలని కోరారు.

పెనుకొండలో న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పెనుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విడిపోయినప్పుడు అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని ఉద్దేశంతో రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర, మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని విభజన చట్టంలో పొందుపరిచారని పేర్కొన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. హైకోర్టు ఏర్పాటుకు పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మారిందని తిరిగి అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపుతోందని విమర్శించారు. రాయలసీమలోనే హైకోర్టు ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నాగరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్అసోసియేషన్ ప్రెసిడెంట్ వాల్మీకి శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, మోహన్ నాయక్, హరి, బాలాజీ, జావేద్, నాగిరెడ్డి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మున్సిపాలిటీ ఇంజినీరింగ్ సెక్షన్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ విభాగంలోని వాటర్ సప్లై తదితర విభాగాల్లో సుమారు 13వేల మంది 25సంవత్సరాల నుంచి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. అయితే వారికి పనికి తగ్గ వేతనం లభించలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జెవి. రమణ, కార్మిక సంఘం అధ్యక్షులు బొగ్గ నాగరాజు, ఉపాధ్యక్షులు దాసరి సురేష్, అంకె పెద్దన్న, సెక్రటరీ ఎస్ .బాబు, కోశాధికారి అనిల్, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిల్లా కేంద్రంలో స్టేడియం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆధ్యాత్మిక కేంద్రం, జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో అంతర్జాతీయ స్థాయి స్టేడియం ఏర్పాటు చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం సత్యసాయి జిల్లా పుట్టపర్తి క్రీడాకారుల సమస్యలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో క్రీడలపై ఎంతో ఆసక్తి ఉన్న ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో క్రీడాకారులకు కొదవలేదని క్రీడా మైదానం లేక పలువురు క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో హాకీ , ఫుట్ బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, టెన్నిస్ తోపాటు వివిధ క్రీడా రంగాల్లో ఎంతోమంది యువతీ యువకులు రాష్ట్ర స్థాయి ,దేశ స్థాయి పోటీలో రాణిస్తున్నారని ఎమ్మెల్యే సభ ద్వారా ప్రభుత్వానికి తెలిపారు. పుట్టపర్తి జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మంచి క్రీడా స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. అదేవిధంగా సాధారణ ప్రభుత్వ పోలీస్ ఉద్యోగ నియమకాల్లోనే కాకుండా ఇతర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ ప్రకారం వీరికి ఉద్యోగ నియామకాల్లో ఎంత కోటా అమలు చేస్తున్నారో తెలపాలని కోరారు. దేశ రాష్ట్రస్థాయిలో క్రీడ పోటీల్లో రాణించి మెడల్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి సౌకర్యాలు ,నగదు ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నారో వాటి వివరాలను సభ ద్వారా తెలపాలని సంబంధిత మంత్రిని కోరారు. మంచి క్రీడాకారులను తయారు చేయాలంటే వారికి అత్యుత్తమ శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇలాంటి శిక్షణ ఇచ్చే శిక్షకులు నేతాజీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ లో ఒక సంవత్సరం పాటు శిక్షణ పొంది ఉండాలని అలాంటిది రాష్ట్రంలో పనిచేసే చాలామంది శిక్షణ ఇచ్చే వారు కేవలం 6 వారాలు మాత్రమే శిక్షణ పొంది ఉద్యోగంలో చేరుతున్నారని చెప్పారు. సామర్థ్యం కలిగిన ప్రమాణాలతో శిక్షణ తీసుకొని నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో వివిధ రంగాల్లో 30 సంవత్సరాలుగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న వారిని గుర్తించి అలాంటి వారిని పభుత్వం ఉద్యోగ క్రమబద్ధీకరణ చేసే అవకాశం ఏమైనా ఉన్నాయా అని సభ ద్వారా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రశ్నించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

శిశుగృహాన్ని సందర్శించిన పీడీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బాలల హక్కుల వారోత్సవాలు దత్తత మాసం ను పురస్కరించుకొని బుధవారం మహిళ, శిశు సంక్షేమ శాఖ శ్రీ సత్య సాయి జిల్లా ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి పీడీ వరలక్ష్మి పుట్టపర్తి లోని శిశు గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అందులో ఉన్న శిశువుల ఆరోగ్య పరిస్థితి, వారి ఎదుగుదల బాగోగులను శిశు గృహ నిర్వాహకురాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులను హరించకుండా, వారికి మంచి ఆరోగ్యం ప్రసాదించాల్సిన బాధ్యత మనపై ఉందని, ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునే శక్తి బాలులకు అందించాలని ఆమె తెలిపారు. శిశు గృహానికి తరలించిన ఇరువురు పిల్లలు ఆరోగ్య పరిస్థితుల పట్ల ఆమె ఆరా తీశారు. శిశు గృహంలో పెరుగుతున్న పిల్లలను దత్తత తీసు కొనువారు ,ఆన్లైన్ ద్వారా గతంలో నమోదు చేసుకుని ఉండాలని సీనియార్టీని బట్టి శిశువులను వారికి దత్తకు ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శిశుగృహ మేనేజర్ సునీత తదితరులు ఉన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా బ్యాళ్ల అంజి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సిపిఎం పుట్టపర్తి మండల కార్యదర్శిగా బ్యాళ్లఅంజిని నియమించినట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. ఈ నెల 17న సిపిఎం కార్మిక కర్షిక భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బాళ్య అంజిని సిపిఎం పుట్టపర్తి మండల కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాళ్ల అంజి మాట్లాడుతూ మండల కార్యదర్శిగా తనను మరోసారి ఎంపిక చేసిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రైతు కూలీలు, కార్మికులు మున్సిపల్ కార్మికులు, స్కీం వర్కర్స్ ,అన్ని వర్గాల ప్రజల కోసం, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు పోరాటాలు చేస్తానని చెప్పారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, మహిళలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమాజంలో స్త్రీలపై రోజు రోజుకు అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డిల్షాద్ అన్నారు.అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జనరల్ బాడీ సమావేశం శాంతిభాయి అధ్యక్షతన బుధవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో నిర్వహించారు. శాంతి భాయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దిల్షాద్ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అణిచివేత నేటికీ కొనసాగుతోందన్నారు. మహిళల రక్షణ చట్టాలు పేపర్లకు పరిమితమయ్యాయని విమర్శించారు. మహిళలు పనిచేసే ప్రాంతాలలో లైంగిక వేధింపులు ఎక్కువ అయ్యాయన్నారు. మన దేశంలోని మహిళల పైన, చిన్న పిల్లల పైన సామూహిక అత్యాచారాలు అధికమయ్యాయనిఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న మనదేశంలో భ్రూణ హత్యలు పెరిగాయన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయాయని ధ్వజమెత్తారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహిళల హక్కుల కోసం, సమానత్వం కోసం పోరాడుతోందన్నారు. అనంతరం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, ఉపాధ్యక్షురాలుగా గౌతమి, సహాయ కార్యదర్శిగా శాంతిభాయి, కోశాధికారిగా చంద్రమ్మతో పాటు మొత్తం 11 మందితో జిల్లా కమిటీ ఎన్నుకున్నారు.

'ఉషమ్మ వద్దే వద్దు' ...



విలేకరులతో మాట్లాడుతున్న గోరంట్ల వైసిపి నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

తమను పార్టీనుంచి సస్పెండ్ చేసినా భయపడమని తమకు ఉషశ్రీ వద్దని శంకరనారాయణే కావాలని మండలంలోని వైసిపి నాయకులు తెగేసి చెప్పారు. మూడు రోజుల క్రితం మండలంలోని పాటూరి శంకర్ రెడ్డి,నాగేనాయక్,బుల్లెట్ బాబును వైసిపి నుండి సస్పెండ్ చేస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలో వెంకటేశ్వర కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాజీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటురి శంకరరెడ్డి,నాగేనాయక్,మాట్లాడుతూ తమను పార్టీ నుంచి నుండి సస్పెండ్ చేస్తే భయపడమని అన్నారు. తమ వెనుక ఉషశ్రీకు వ్యతిరేకంగ 300 మంది ఉన్నారని వారందరినీ సస్పెండ్ చేస్తారా అని సవాల్ విసిరారు. తాము డబ్బులు ఇవ్వనందుకు సస్పెండ్ చేస్తారా అని ఆరోపించారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఉషమ్మ సమక్షంలో వైసిపిలో చేరి పార్టీ కోసం పాటు పడితే తనను ఎలా సస్పెండ్ చేయిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో 22 వేల ఓట్లు ఉన్న తమ గిరిజన తండాల్లోకి ఉషశ్రీ ని రానివ్వకుండ అడ్డుకుంటామన్నారు.అదేవిధంగా బుల్లెట్ బాబు మాట్లాడుతూ జగన్ కోసం పని చేసి ఉషశ్రీకి వ్యతిరేకంగా పనిచేస్తామని చెప్పారు. పార్టీకోసం పాటుపడుతున్న తమను శంకరన్న మనుషులం అని, పార్టీకి వ్యతిరేకంగా ఉన్నామని సస్పెండ్ చేయడం తగదని అన్నారు. ఇక్కడ జరుగుతున్న రాజకీయ పరిణామాలను జగనన్న దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రమీలా మూర్తి, సర్పంచులు గంగప్ప, శివనందా, నరిసిరెడ్డి,ప్రభాకర్ రావు, శివమణి, శ్రీరాములు, రమణ, ఎంపిటిసిలు శ్రీనివాస్ రెడ్డి, పాటూరి లక్ష్మిరెడ్డి, సమర సింహరెడ్డి, చిట్ట తులసి కుమార్ తదితరులు పాల్గొన్నారు

అక్రమ మైనింగ్‌పై అసెంబ్లీలో ప్రస్తావించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి హయాంలో జగనన్న లేఅవుట్ల భూసేకరణలో జరిగిన అవకతవకలపై బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రస్తావించడం పట్ల బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. జగనన్న లేఅవుట్ భూ సేకరణ విషయమై విచారణ జరపాలని తాము కొంతకాలంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలకు భూమి కేటాయించిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరడం అభినందనీయం అన్నారు. అలాగే రాయదుర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్, మట్టి, ఇసుక అక్రమ రవాణాపైప అసెంబ్లీలో ప్రస్తావించాలని, సిబిఐ విచారణ జరిపించి సహజ వనరులను జాతీయ సంపదను కాపాడాలని కోరాలని చిందనూరు నాగరాజు కోరారు.

అసెంబ్లీ దృష్టికి ఇళ్ల స్థలాల అక్రమాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి పాలనలో పేదల కు ఇళ్ల స్థలాల పేరుతో రాష్ట్ర వ్యాప్తం గా జరిగిన భూ సేకరణ కుంభ కోణంపై సిఐడి విచారణ జరపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్ల స్థలాల భూసేకరణలో నియోజ కవర్గంలో రూ. 6 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. గుమ్మఘట్ట వైసిపి మండల కన్వీనర్ గొల్లపల్లి కాంతారెడ్డి, నేత్రపల్లి బీమారెడ్డి 8 మంది రైతులతో రూ. 6 కోట్లు స్వాహా చేశారని తెలిపారు. పేద రైతుల నుంచి ఎకరా రూ. 6 నుంచి రూ. 8 లక్షలకు భూమిని కొనుగోలు చేసి రూ. 35 నుంచి రూ. 40 లక్షల వరకూ ప్రభుత్వానికి అమ్మారన్నారు. పేద రైతుల భూములను అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయలు స్వాహా చేసిన వైసిపి నాయకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

కోడలిపై మామ దాడి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

కుటుంబ కలహాలతో మామ కోడలి పై కొడవలితో దాడి చేసిన ఘటన పట్టణంలో బుధవారం వెలుగు చూసింది. పట్టణానికి చెందిన మూర్తి, నందిని దంపతుల మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం నందిని పుట్టినిల్లు అయిన హిందూపురానికి వెళ్ళింది తిరిగి తల్లిదండ్రులతో పాటు అత్తగారింటికి రాగా భర్త ఇంట్లోకి అనుమతించక పోవడంతో ఆమె తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బయలుదేరారు. విషయం గమనించిన నందిని మామ ముత్యాలప్ప మార్గం మధ్యలో అడ్డగించి నచ్చచెప్పేందుకు ప్రయత్నించాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో విసుగుచెంది కొడవలితో కోడలిపై దాడి చేశాడు. గాయపడిన నందిని తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళింది. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్‌లో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ముత్యాలప్పను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన నందినిని ఆస్పత్రికి తరలించారు. ఈసందర్భంగా నందిని తల్లి మాట్లాడుతూ తన అల్లుడు కూతురు మధ్య విభేదాలు ఉండడంతో వారి ఇరువురికి నచ్చచెప్పేందుకు హిందూపురం నుంచి ఇక్కడికి వచ్చామన్నారు. ఈ క్రమంలోనే ముత్యాలప్ప తన కుమార్తె నందిని పై దాడి చేశాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన తెలిపారు. ఎస్ఐ ఉమా మనోహర్ రాజు ఆధ్వర్యంలో నల్లమాడ మండలం కొత్తపల్లి తండాలో దాడులు నిర్వహించి 300 లీటర్ల బెల్లపు ఊట, మూడు లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మడం, నాటు సారా తయారు చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ నాగరాజు హెచ్చరించారు.

మహిళా రైతుపై విఆర్ఒ దౌర్జన్యం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయలో విఆర్ఒ ఓ మహిళా రైతుపై దౌర్జనానికి ఒడిగట్టాడు. రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామ మహిళ రైతు శ్రీలలిత కు చెందిన భూమి ఒరిజినల్ పత్రాలు తీసుకొన్న విఆర్ఒ వాటిని ఇవ్వటానికి గత కొంతకాలంగా నిర్లక్ష్యం చేస్తున్నాడని బాధిత మహిళా రైతు వాపోయారు. తన భూమికి సంబంధించిన పత్రాలను బీరువాలో పెట్టుకొన్న ఆయన తనవద్ద లేవంటూ రోజు తిప్పుకుంటున్నారని అన్నారు. వాటిని ఇవ్వటానికి రూ. 3లక్షలు రూపాయలు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. ఈవిషయంపై బుధవారం అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు, మహిళా రైతు విఆర్ఒను ప్రశ్నిస్తే తమపై దుర్భాషలాడుతున్నారని బాధిత మహిళారైతు వాపోయారు. ఈ వివాదం పై విచారణ జరిపి మహిళా రైతును లంచం డిమాండ్ చేసిన విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

అనారోగ్యంతో మండల సర్వేయర్ మృతి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల సర్వేయర్ ఆనంద్ నాయక్ (60) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కదిరి సమీపంలోని మొటుకుపల్లి వద్ద తన నివాసంలో బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో ఆనంద్‌నాయక్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ బాబురావు, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆర్ఐ అశోక్ చక్రవర్తి, వీఆర్వోలు, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు.

సోమందేపల్లిలో మాజీ ఎంపీటీసీ...

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని వినాయక నగర్ నివాసముంటున్న మాజీ ఎంపీటీసీ నారాయణ అనారోగ్య కారణంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సత్యసాయి జిల్లా వైసీపీ అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, అదేవిధంగా మాజీ మంత్రి శంకర్ నారాయణ వారి వారి గ్రూపులతో వేర్వురుగా వచ్చి మృతుని కుటుంబ సభ్యుల్ని పరామర్శించి మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివాసులు, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జడ్పిటిసి డిసి అశోక్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు కొల్లప్ప, తదితర నాయకులు పాల్గొన్నారు.

పరిగిలో సీనియర్ వైసిపి నాయకుడు...

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పైడేటి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, పరిగి మండల వైసీపీ మాజీ మండల కన్వీనర్ డివి రమణ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు శంకర్ నారాయణ, ఉషశ్రీ చరణ్, ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటి శ్రీధర్, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కదిరి అప్‌గ్రేడ్ సిఐగా నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి అప్‌గ్రేడ్ సిఐగా నిరంజన్ రెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇతను గతంలో కూడా కదిరి ప్రాంతంలో విధులు నిర్వహించారు. పుట్టపర్తిలో పనిచేస్తున్న ఈయనను కదిరి అప్‌గ్రేడ్ సిఐగా ఉన్నత అధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే అప్‌గ్రేడ్ ఎస్ఐగా రమణారెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

సత్యసాయి జయంతికి పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - కొత్తచెరువురూరల్

శ్రీ సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా ఈనెల 23న సత్యసాయి జిల్లాలోని నాలుగు మండలాల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పుట్టపర్తి కేంద్రానికి ఆనుకొని ఉన్న పుట్టపర్తి, బుక్కపట్నం నల్లమాడ, కొత్తచెరువు మండలాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు నవంబర్ 23 న సెలవు ప్రకటిస్తున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడా పోటీల్లో ఎపిఆర్‌జెసి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పరిగి

అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడా పోటీలలో పరిగి మండలం కొడిగనహళ్లి ఎపిఆర్‌జెసి విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. వివిధ క్రీడాల్లో సత్తా చాటారు . వాలీబాల్ , కబడ్డీ , ఖోఖో , టెన్నికాయిట్ ,బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, త్రోబాల్, యోగా తదితర పోటీలతో పాటు అథ్లెటిక్స్ లోను జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు, రాష్ట్రస్థాయిలో జరిగే వివిధ పోటీల్లో ఎపిఆర్‌జెసి కొడిగెనహళ్ళి విద్యార్థులు 30 మంది జిల్లా తరపున పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ జలజ తెలిపారు.రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు భాస్కరశర్మ, బీబీ, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన హిందూపురం పురపాలక సంఘంలో సాధారణ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సబిహా బాను, నఫీసాను ఆదర్శంగా తీసు కోవాలని ఎంఇఒ గంగప్ప అన్నారు. పట్టణం లోని నింకం పల్లి ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పాఠశాలలో పనిచేస్తున్న సబిహా భాను, రాష్ట్రస్థాయిలో ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, అదేవిధంగా సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ అహ్మద్ నగర్ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న నఫీసా బేగం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికయ్యారు. వీరిద్దరిని బుధవారం పట్టణంలోని అజీజియా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అజీజియా ఉన్నత పాఠశాల హెచ్ఎం రంగనాయకులు, ఉపాధ్యాయులు వసీం తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పుస్తక పఠనం అవసరం

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో అధికారులు



కదిరిలో విద్యార్థులకు బహుమతులు అందజేత



రొద్దంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు, విద్యార్థులు



బత్తలపల్లిలో విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - పెనుకొండ

పిల్లలు అభివృద్ధి చెందాలంటే పుస్తక పఠనం అవసరం అని గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా అన్నారు. బుధవారం శాఖా గ్రంథాలయంలో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానం నిల్వ ఉన్న దేవాలయాలని అన్నారు. విద్యార్థులు చిన్న తనం నుండే గ్రంథాలయానికి వెళ్లి అక్కడ ఉండే విజ్ఞానాన్ని సంపాదించాలన్నారు. పుస్తక పఠనం వలన పిల్లల్లో మేధాశక్తి పెంపొందుతుందని అన్నారు. అనంతరం వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు షమీవుల్లా, భాస్కర్, ప్రైవేట్ స్కూలు ఉపాధ్యాయులు దాదు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వృత్తివిద్యల అధికారి లాజర్ తెలిపారు. 57వ గ్రంథాలయ ముగింపు ఉత్సవాలలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లాజర్ మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అలాగే డిజిటల్ గ్రంథాలయాల పైన కూడా అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, అటెండర్ వెంకటరమణప్ప, ఇన్‌ఛార్జి హెచ్ఎం విజయభాస్కర్, ఉపాధ్యాయులు రాధా, లక్ష్మి, జానకి, అనంతలక్ష్మి, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎంఇఒ కృష్ణ నాయక్, ఉపాధ్యాయుడు రాజశేఖర్ రవీంద్రారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పర్యభాను, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ఓబుళదేవర చెరువు: 57వ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి రాజబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ నందు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఎంఇఒ రమణ, హెడ్మాస్టర్ శోభారాణి ,చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

కదిరి టౌన్ : 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం కదిరి శాఖా గ్రంథాలయం లో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్దన్, పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది చాంద్ బాషా పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వారం రోజులు పాటు నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యారచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారిణి రాజేశ్వరి, విద్యాధారి హైస్కూల్ హెచ్ఎం లక్ష్మి,ఉపాధ్యాయులు శ్రీకాంత్, రషీద, ఆశ్వణి. మహేష్, చంద్రశేఖర్, గ్రంథాలయ సిబ్బంది. విద్యార్థులు. పాఠరులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు సూచించారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల క్రితం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయుల చేత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ షేక్షావలి, ఎల్ హరిచంద్ర నాయుడు, ఎస్ శ్రీనివాసులు, అంజన్ రెడ్డి, నీలిమ, విద్యార్థులు తదితరులు పాల్కొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలోని గ్రంథాలయశాఖ పరిధిలో 57 వ జాతీయ గ్రాంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపియుపి ఉర్దూ స్కూల్ హెచ్ఎం మహమ్మద్ రఫిక్, ఉపాధ్యాయులు ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, ఉర్దూ స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం హసీనా, ఉపాధ్యాయులు జవ్వాజి నాగరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ శాఖ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు రామకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది, దాదా ఖలందర్ పాల్గొన్నారు.

బాల్యాన్ని మొబైల్‌కు బలి కానివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప

ప్రజాశక్తి-హిందూపురం

పసి వయసులో ఆట పాటలతో ఉండాల్సిన బాల్యం నేడు మొబైల్ కి బలి అవుతోందనిచిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఏపీ మోడల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ రవినాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అధితిగా జిల్లా బాలల పరిరక్షణ సమితి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చిన్నారుల తల్లి దండ్రులు ప్రతి నిత్యం మొబైల్ ఫోన్‌తో గడుపుతు, వారి పిల్లల కోసం సమయాన్ని కేటాయించక పోవడం భాధకరమన్నారు. వీరి బాటలోనే వారి పిల్లలు సైతం వారి చదువును నిర్లక్ష్యం చేస్తు, వారి విలువైన సమయాన్ని మొబైల్ ఫోన్ కు అంకితం చేస్తున్నారన్నారు. సమాజంలో ఏదో ఒక చోట బాలికలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటే వాటికి ప్రధాన కారణం మొబైల్ వినియోగమేనని చెప్పారు. కరోనా అనంతరం పిల్లలలో చదువు పట్ల ఆసక్తి తగ్గి సామాజిక మాద్యమాలకు ప్రభావితులై జీవితం నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. జ్ఞానాన్ని పొందడానికి మాత్రమే మొబైల్ ఉపయోగించే విధంగా ఉండాలి తప్ప అదే జీవితం కారాదని అన్నారు. బాలల సంరక్షణ సమితి చిన్నారుల కౌన్సిలర్ లు శివలత, ప్రశన్న మాట్లాడుతు బాలల కోసం పని చేసే వ్యవస్థ బాలల సంరక్షణ సమితి అన్నారు. సమితి సేవలు పిల్లలు ఉపయోగించకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అదే విధంగా గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తిప్పేసామి, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సరస్వతి, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చొద్దు

ఓబుళదేవర చెరువు : పాఠశాలల్ని ప్రయోగశాలలుగా మార్చవద్దని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం వంటి అంశాలను పరిగణన లోకి తీసుకోకుండా హఠాత్తుగా పాఠశాల పనివేళల పొడిగింపు నిర్ణయం సరికాదన్నారు. అనేక ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలపై కొత్త కొత్త ప్రయోగాలు చేయడంతో లక్షలాదిమంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 15 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తారని... సరైన సమయానికి రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల బాలికలకు భద్రతా సమస్యలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు విద్యార్జన కోసం ఏకాగ్రతతో ఎంతసేవు ఉండగలరనే అంశంపై వారి మానసిక స్థితిని అంచనా వేసి పని గంటలు నిర్ణయించాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పని గంటలను, విద్య, మానసికవేత్తల సూచనలను పరిగణలోకి తీసుకుని పని గంటలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్ నాయక్ , వెంకట చలమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి- పరిగి

మండలంలోని శ్రీరంగరాజపల్లి గ్రామంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక గ్రామసభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ హసీనా సుల్తానా మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి భూ సమస్య పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ గ్రామసభలను నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోవింద్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, ఆర్ఐ సిద్దేశ్వర, వీఆర్వో రాఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా. గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆర్జీల రూపంలో అందజేయాలన్నారు. వాటిపై పూర్తిగా విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రాజకీయ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.